తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం

- నిద్రావస్థలో మున్సిపాలిటీ యంత్రాంగం
- కౌన్సిల్ సభ్యులు నిలదీయడంతో ట్యాంకర్‌కు మరమ్మతులు
- సకాలంలో స్పందించక శిథిలావస్థకు చేరిన మరో ట్యాంకర్


అమలాపురం బైపాస్ రోడ్డులో మొరాయించి మూలకు చేరిన ట్యాంకర్ (ఫైల్)


సకాలంలో మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరిన మరో ట్యాంకర్

అమలాపురం టౌన్: పట్టణంలోని మున్సిపాలిటీ తాగునీటి సరఫరా వ్యవస్థ లోపాలపై ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ పలువురు కౌన్సిలర్లు అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీస్తూనే ఉన్నారు. తమ వార్డుల్లో తాగునీటి కష్టాల గురించి చెబుతూనే వస్తున్నారు. ముఖ్యంగా పట్టణ పరిధిలోని 15 శివార్లకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపిస్తేనే ఆయా శివార్ల ప్రజల గొంతు తడుస్తుంది. ప్రస్తుతం మున్సిపాలిటీకి మూడు ట్యాంకర్లు ఉన్నాయి. రెండు మరమ్మతులకు గురై ఒకటి పట్టణ బైపాస్ రోడ్డు చెంత, మరొకటి వాటర్ వర్క్స్ ప్రాంగణంలో కొన్ని నెలలుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. వార్డుకు ట్యాంకర్ నీటిని రెగ్యులర్‌గా పంపించడం లేదని కొందరు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో అరిచి గగ్గోలు పెట్టిన సందర్భాలు ఉన్నాయి.

ఎట్టకేలకు కదలిక

అనేక కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు మరమ్మతులకు గురైన రెండు ట్యాంకర్ల గురించి పలు మార్లు ప్రస్తావించి విసిగి వేసారి పోయారు. గత నెల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సైతం ట్యాంకర్ల మరమ్మతులు చేయించరా..? అంటూ అధికారులను నిలదీశారు. కాంట్రాక్టర్లకు అత్యుత్సాహంగా బిల్లులు మంజూరు చేయడానికి చూపించే చొరవ ట్యాంకర్ల మరమ్మతులపై ఎందుకు చూపడం లేదని మండిపడ్డారు. కౌన్సిలర్లు పదే పదే నిలదీస్తుండడంతో అధికారుల్లో ఎట్టకేలకు చలనం కలిగింది. బైపాస్ రోడ్డులో మరమ్మతులకు గురైన ట్యాంకర్‌ను అలానే వదిలేశారు. ఈ ట్యాంకర్‌కు ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. అయితే వాటర్ వర్క్స్ ప్రాంగణంలో ఉన్న ట్యాంకర్ మరమ్మతులకు ఇక పనికి రాదని, దాని కాలం చెల్లిందని అధికారులు చెబుతున్నారు.

కొన్ని వార్డుల్లో తాగునీటి కుళాయిల నుంచి సరిగా నీరు రావడం లేదని, మరికొన్ని వార్డుల్లో కుళాయిల నుంచి రంగు మారిన నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. పట్టణంలో మెట్లకాలనీ, చింతగుంట చెరువు, కొంకాపల్లి ప్రాంతంలో కొన్ని శివారు ప్రాంతాలకు తాగునీరు పూర్తి స్థాయిలో అందక ఆయా శివార్ల ప్రజలు దప్పికతో అవస్థలు పడుతున్నారు. ఓ పక్క గత ప్రభుత్వంలో రూ.20 కోట్లతో మంజూరైన తాగునీటి పథకాలను పూర్తి చేయక, మరో పక్క కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు లేవనెత్తిన తాగునీటి సమస్యలపై స్పందించక పట్టణంలో తాగునీటి ఇక్కట్లు అనివార్య మవుతున్నాయి. గత కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ట్యాంకర్లపై సీరియస్‌గా చర్చించడంతో పాటు వాటి మరమ్మతులపై అధికారులకు వార్నింగ్ ఇవ్వడంతో ఎట్టకేలకు వారిలో కదలిక వచ్చి ఓ ట్యాంకర్‌ను బాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

> **మరమ్మతులు చేయిస్తున్నాం**
>
> బైపాస్‌లో ఆగిపోయిన ట్యాంకర్‌కు మరమ్మతులు చేయిస్తున్నాం. మరో ట్యాంకర్ శిథిలావస్థకు చేరింది. దానికి మరమ్మతులు చేయటం కుదరదు. మరమ్మతులు పూర్తయితే తాగునీటి సమస్య కొంత వరకు తీరుతుంది.
>
> సూర్య భాస్కరరావు, ఏఈ, తాగునీటి విభాగం.

మసీదు అభివృద్ధికి రూ.8.64 లక్షల మంజూరు


చెక్‌ను మసీదు కమిటీ ప్రతినిధులకు అందజేస్తున్న ఎంపీ హరీష్ మాథూర్

అమలాపురం టౌన్: పట్టణంలోని మొల్లా ముస్తాఫా మసీదు అభివృద్ధికి రూ.8.64 లక్షలు మంజూరైనట్లు ఆ మసీదు కమిటీ అధ్యక్షుడు మొయినుద్దీన్ తెలిపారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్ మాథూర్ మసీదు కమిటీ ప్రతినిధులు, ముస్లిం నేతలకు గురువారం సాయంత్రం అందజేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు మెంబర్‌గా హాజీ ముఖర్రం హుస్సేన్ బాధ్యతలు చేపట్టాక తొలిసారి అమలాపురం మసీదుకు నిధులు మంజూరు చేయించారని మసీదు కమిటీ అధ్యక్షుడు మొయినుద్దీన్ అన్నారు. వక్ఫ్ బోర్డుకు మసీదు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో కోనసీమ ముస్లిం యూత్ అధ్యక్షుడు ఎండీ బషీర్, మసీదు కమిటీ కోశాధికారి వలీ, కమిటీ సభ్యులు ఎండీ అలీ, ఎంఎ ఖాన్, షాజిద్, లాల్, రాజా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్.పల్లిపాలెంలో అశ్లీల నృత్యాలు

చోద్యం చూసిన పోలీసులు


అశ్లీల నృత్య ప్రదర్శనలు

అల్లవరం: సంక్రాంతి పండగ అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. గతంలో ఎన్నడూ చూడనంతగా కోడి పందేలు, గుండాట, అశ్లీల నృత్యాలను భారీ స్థాయిలో నిర్వహించారు. అల్లవరం మండలం ఎస్.పల్లిపాలెంలో స్థానిక అధికార పార్టీ నాయకుడి ఆధ్వర్యంలో రెండు చోట్ల బుధవారం రాత్రి అశ్లీల నృత్యాలు నిర్వహించారు. ఎస్.పల్లిపాలెంలోని పాతూరు, కొత్తూరులో యథేచ్ఛగా సాగాయి. అశ్లీల నృత్య ప్రదర్శనలపై కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం అశ్లీల నృత్యాలను నిలువరించే ప్రయత్నం చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి


ఇసుకపట్ల శ్రీనుబాబు(ఫైల్)

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బ్రహ్మ సమేధ్యం మాజీ సర్పంచి ఇసుకపట్ల శ్రీనుబాబు (49) గుండె పోటుతో చికిత్స పొందుతూ కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం మృతి చెందారు. రెండు రోజుల క్రితం గుండె పోటు రావడంతో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీనుబాబు శరీరం వైద్యానికి సహకరించక పోవడం, మరల గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు స్నేహితులు తెలిపారు. మంచి మనిషిగా అందరికీ సుపరిచితుడైన శ్రీనుబాబు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని పలువురు సంతాపం వెలిబుచ్చారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆసుపత్రిలో ఉండి శ్రీనుబాబు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అప్రమత్తం చేసినా ఫలితం లేకపోయింది.

ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలి

తాళ్లరేవు: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని సీపీఎం పార్టీ మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత మార్కెట్‌లో కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువ ధరకు కొంటున్నారని దీంతో రైతులు, కౌలు రైతులు నష్ట పోతున్నారని పేర్కొన్నారు. కేరళ, తెలంగాణా, చండీఘడ్ వంటి రాష్ట్రాలు బోనస్ ప్రకటించి అక్కడ రైతులను ఆదుకుంటున్నారని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మద్దతు ధర ప్రకటించి, బోనస్ ఇవ్వాలని కోరారు.

ఇద్దరు బైండోవర్

అల్లవరం: అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. బోడసకుర్రు గ్రామానికి చెందిన చొల్లంగి రాజ రాజేశ్వరరావు, గోడికి చెందిన ఉప్పే సహదేవుడిని అల్లవరం తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు ముందు గురువారం హాజరు పరిచినట్లు చెప్పారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు


పి.మల్లవరం జంక్షన్‌లో బైక్‌ను ఢీకొన్న ఆటో

తాళ్లరేవు: జాతీయ రహదారిలోని పి.మల్లవరం జంక్షన్ వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు రత్సవారిపేటకు చెందిన రత్స సత్యనారాయణ బైక్‌పై చేపల వేటకు వెళుతూ జంక్షన్‌లో రహదారిపై నిల్చొని టీ తాగుతున్నాడు. ఆ సమయంలో అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న ఆటో సత్యనారాయణను బలంగా ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ప్రభల తీర్థం

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారి ఆలయం వద్ద ప్రభలు కొలువు దీరాయి. ఆలయ ప్రాంగణంలో భక్తుల దర్శనార్థం ప్రభలను ఉంచారు. అలాగే నేదునూరు, వెలువలపల్లి, మడుపల్లి, చింతనలంక, వీరవల్లిపాలెం, కె.జగన్నాథపురం, మాగం, సిరిపల్లి, విలస తదితర గ్రామా ల్లోని ఆలయాల వద్ద భక్తుల దర్శనం కోసం ప్రభలను ఉంచారు. భక్తులు పూజలు నిర్వహించారు.

ఘనంగా వనువులమ్మ తల్లి తీర్థం


వనువులమ్మను దర్శించుకుంటున్న ప్రజా ప్రతినిధులు

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామ పరిధి శెట్టిపల్లి గ్రామదేవత వనువులమ్మ తల్లి తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన వనువులమ్మను దర్శించుకునేందుకు తాండవపల్లి, చిందాడగరువు, కామనగరువు, రోళ్లపాలెం, ఇమ్మిడివర్రుడు, గూడాల, రంగాపురం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తాండవపల్లి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, జనసేన మండల అధ్యక్షుడు లింగోలు పండు, నాయకులు నల్లా వెంకటేశ్వరరావు, కొప్పల నాగమానస, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కైరం సత్తిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు గుమ్మళ్ల దొరబాబు, రంకిరెడ్డి శ్రీను, కైరం రాము, కైరం వెంకటరత్నం, కై రం రాంబాబు, ఆదినారాయణ ఆధ్వర్యంలో అమ్మవారి జాగారం, తీర్థ మహోత్సవాలు జరిగాయి. తాలూకా ఎస్సై శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యం


ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఈడీ విజయరత్న

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లకు పీరియాడికల్ మెడికల్ టెస్టులు, నూతన టెక్నాలజీపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ జోన్- 2 విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో గురువారం రహదారి భద్రత మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యారేజీలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతినెల డ్రైవర్లకు జోనల్ ఆఫీస్ విజయవాడలో అవగాహన సదస్సు, కౌన్సెలింగ్‌ను అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజా రవాణా అధికారి డి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెరుగైన సేవలందిస్తున్న అధికారులు, ఉద్యోగులను అభినందించారు. యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లు, ఉత్తమ కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ అమలాపురం డిపోకు 25 కొత్త బిఎస్-6 వాహనాలు వచ్చినట్లు తెలిపారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి సంక్రాంతి స్పెషల్ సర్వీసులు, గ్యారేజ్ నిర్వహణను వివరించారు.

సాహితీవేత్తలకు ఆదికవి త్రిపురనేని


సొసైటీ డైరెక్టర్ యలమంచిలి బాలరాజును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

ముమ్మిడివరం: సాహితీ వేత్తలకు ఆదికవి త్రిపురనేని రామస్వామి అని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో త్రిపురనేని 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డా.పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన పలు సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. దక్షిణాది ఆత్మ గౌరవ భావజాల కవిగా, అచ్చ తెలుగు నుడికార సాహితీవేత్తగా, సంపూర్ణ జాతీయ వాదిగా కవిరాజు సుప్రసిద్ధుడని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఇటీవల ముమ్మిడివరం సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన యలమంచిలి బాలరాజును సత్కరించారు. పలువురు కవులు, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో రేవు అప్పలస్వామి, ఎస్ఎన్ మున్నేశ్వరరావు, వీ.చిరంజీవి, కడలి సత్యనారాయణ, ఎం.ఆశీర్వాదం, జనిపెల్ల సత్యనారాయణ, ఎస్.అబ్బులు, ఉంగరాల వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన సాగర తీరం


ఎస్.యానం సముద్ర తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలోని సాగర తీర ప్రాంతానికి గురువారం జనం పోటెత్తారు. పర్యాటకులు కుటుంబాలు, స్నేహితులతో వచ్చి తీర ప్రాంతాన ఇసుకలో సేద తీరారు. పతంగులు ఎగరవేస్తూ, ఎగిసిపడే అలల్లో కేరింతలు కొడుతూ ఆడి పాడారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు చివరి రోజు కావడంతో బాణా సంచాను పెద్ద ఎత్తున కాల్చారు. సాగర తీరంలో రంగు రంగులతో ఎగిసిపడుతున్న నిప్పు రవ్వలను పర్యాటకులు తమ చరవాణిలో బంధించారు.

కొనసాగిన కోడి పందేలు

అల్లవరం: సంక్రాంతి పండగ నేపథ్యంలో మూడు రోజుల పాటు కోడి పందేలు, గుండాట నిర్వహించడం సర్వ సాధారణం. అయితే ఈ సంక్రాంతికి మాత్రం నాలుగు రోజుల పాటు నిర్వహించారు. అల్లవరం సడక్ రోడ్డు, కోడూరుపాడులోని ఆకులవారిపాలెం పందెం బరుల్లో యథేచ్ఛగా పందేలు, గుండాట నిర్వహించి జూద ప్రియుల నుంచి భారీగా డబ్బులను దండుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో పందెం బరులు నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉరకలెత్తిన ఉత్సాహం

- పి.మల్లవరంలో సంక్రాంతి వేడుకలు
- మహిళలు, చిన్నారులకు పోటీలు
- విజేతలకు బహుమతుల అందజేత


రంగవల్లుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ముగ్గు


విజేతలకు బహుమతులు అందిస్తున్న లక్ష్మణరావు తదితరులు

తాళ్లరేవు: సంస్కృతీ, సంప్రదాయాలలో భాగమైన సంక్రాంతి రంగవల్లుల పోటీలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతాయని సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ అన్నారు. పి.మల్లవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద గురువారం సాయంత్రం మహిళలకు రంగవల్లులు, చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో పి.రజిని ప్రథమ, వైవీవీ లక్ష్మి ద్వితీయ, జి.విమల తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. మ్యూజికల్ చైర్స్ పోటీలలో పి.వసుధ, జె.హర్షిత, సీహెచ్ బాల ధనశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. శెట్టి బలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఉభయ గోదావరి జిల్లాల జనసేన పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ ముత్యాల జయలక్ష్మి తదితరులు విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో విళ్ల సత్యనారాయణ, ధూళిపూడి శుభ, నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, దున్నా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతికి ప్రతీకలు ముగ్గులు


విజేతకు బహుమతులు అందిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

అమలాపురం రూరల్: సంస్కృతీ సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకలుగా నిలుస్తాయని కోనసీమ జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అన్నారు. బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసి యున్న పద్మావతీ, అలమేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి మందిరం వద్ద శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కిసాన్ సంఘం నాయకుడు ఉప్పుగంటి భాస్కరరావు, పచ్చిగోళ్ల సుధ, మడా రాము, శ్రీనివాస బాల మిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, బళ్ల సత్తిరాజు, అంకం పెదరాజు, ఊటుకూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయికలు


వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-99 బ్యాచ్ విద్యార్థులు


వన్నెచింతలపూడిలో కలుసుకున్న ఉప్పలపు వంశస్తులు

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1994-99 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక గురువారం జరిగింది. చదువులమ్మ చెట్టు నీడలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అలనాడు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించి పాద పూజ చేశారు. తరగతి గదుల్లో చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. వృత్తి, ఉద్యోగ వ్యాపారాలలో ఎక్కడెక్కడో స్థిర పడిన మిత్రులంతా తరలి రావడంతో పాఠశాల ప్రాంగణం పులకించి పోయింది.

ఉప్పలపు వంశస్థుల ఆత్మీయ కలయిక

అమలాపురం రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా అమలాపురం మండలం వన్నె చింతలపూడి గ్రామంలో ఉప్పలపు జగ్గరాజు, పద్మావతి వంశస్తుల ఆత్మీయ కలయికను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. వంశస్తుల ఇలవేల్పయిన సత్తెమ్మ తల్లి విగ్రహం వద్ద ఉప్పలపు కుటుంబీకులు ప్రత్యేక మొక్కుబడులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు. అంతా కలిసి ఆటపాటలతో సరదాగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. 24 మంది మనుమలు, 32 మంది ముని మనుమలు, ముగ్గురు ఇను మనుమలు పాల్గొన్నారు.

సురక్షిత డ్రైవింగ్‌తో ప్రమాదాల నివారణ

రావులపాలెం: సురక్షితమైన డ్రైవింగ్‌తో ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ ఓలేటి శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్‌లో డిపో మేనేజర్ జీజీవీ రమణ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఎంవీఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 85 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల జరుగుతాయని, 10 శాతం వాహనం ఫిటినెస్, 5 శాతం వాతావరణ పరిస్థితుల కారణంగా ఉంటాయన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే మొదటి గంటలోనే (గోల్డెన్ అవర్) క్షతగాత్రులను దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలని సూచించారు.

సెపక్ తక్రా పోటీలకు జిల్లా జట్టు పయనం


జిల్లా సెపక్ తక్రా జట్టుతో ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్: శుక్ర, శని వారాల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగే 28వ జూనియర్ సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి బాల, బాలికల పోటీలు జరుగుతునట్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సెపక్ తక్రా క్రీడాధ్యక్షుడు జవ్వాది తాత బాబు, కార్యదర్శి కేతా సాయి దుర్గ ప్రసాద్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన బాల బాలికలు గత వారం రోజులుగా అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో కోచ్ యంద్ర గౌతమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందినట్లు తెలిపారు. గురువారం ముగింపు శిక్షణకు అతిథులుగా విచ్చేసిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ టీఆర్‌కే ప్రసాద్, ఇందుకూరి శ్రీధర్ వర్మ, డాక్టర్ వైవీ నరసింహారావు, కూచిమంచి కృష్ణ, తోట రాము, కేవీవీ సత్యనారాయణ, చొల్లంగి అప్పాజీలు మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా బాల బాలికల జట్టు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు పతకలు సాధించాలన్నారు.

వంతెన రోడ్లకు బర్మ్‌ల నిర్మాణం


బర్మ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు, సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: పట్టణంలో ట్రాఫిక్ ప్రతి బంధకాలకు నిలయంగా మారిన ఈదరపల్లి, నల్ల, ఎర్ర వంతెనల వద్ద రోడ్ల మార్జిన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ రోడ్లకు ఎడ్జిలు (బర్మ్‌లు) నిర్మిస్తే చాలా వరకూ రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని పట్టణ సీఐ పి.వీరబాబు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజుకు సూచించారు. దీనిపై స్పందించిన కమిషనర్ రాజు ఈ మూడు వంతెనల వద్ద ప్రమాద భరితంగా ఉన్న రోడ్లకు బర్మ్‌లు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. తొలుత ఎర్ర వంతెన వద్ద రోడ్డుకు బర్మ్‌లు వేసే నిర్మాణ పనులను కమిషనర్, సీఐలు స్వయంగా పరిశీలించారు. మిగతా రెండు వంతెనల వద్ద గల రోడ్లకు సరైన ఎడ్జిలు లేక వాహన చోదకులు ఇబ్బంది పడడమే కాకుండా తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని సీఐ వీరబాబు మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. ఆ రెండు వంతెనల వద్ద కూడా బర్మ్ పనులు పూర్తవుతున్నాయి. వంతెనలకు అటు ఇటు రోడ్లకు బర్మ్‌లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు కమిషనర్, సీఐలు పలు సూచనలు ఇచ్చారు.